సాక్షి
కామారెడ్డి

శనివారం। 31। ఆగస్టు। 2024



ప్రథమ చికిత్సే చేయాలి

ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను వైద్యాధికారులు తనిఖీ చేస్తున్నారు. పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

- 9లో ▸



వైద్య శిబిరాలు..

భూంపల్లి, మెంగారం, గోపాల్‌పేట, సంఘమేశ్వర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.7/21.2

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ: బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్డీవో రమేశ్ రాథోడ్ నుంచి సబ్ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్



కామారెడ్డి క్రైం : బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్ : రేషన్ షాప్‌లద్వారా సెప్టెంబర్‌కు సంబంధించిన బియ్యం పంపిణీ ప్రక్రియ ఆదివారం ప్రారంభం కానుంది. ఆహార భద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

'క్రీడలతో మానసికోల్లాసం'



బాన్సువాడ: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతిని బాన్సువాడ బాలికల ఆశ్రమ పాఠశాల జట్టు, ద్వితీయ బహుమతిని బోర్లం గురుకుల పాఠశాల జట్టు కైవసం చేసుకున్నాయి. వాలీబాల్‌లో ప్రథమ బహుమతిని బాన్సువాడలోని సింధు విద్యాలయం, ద్వితీయ బహుమతిని బుడ్మి ఉన్నత పాఠశాల జట్టు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఖలేక్, శ్రీధర్, హకీం, బాబా, వాహబ్, నార్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గాడిన పడేనా..?

వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం పారిశుద్ధ్య లోపమే.. ఈ సమస్య పరిష్కారంతోపాటు పల్లె పాలనపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టి సారించారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడంతోపాటు డెయిలీ సానిటేషన్ రిపోర్టును పక్కాగా నివేదించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్న హెచ్చరికలూ పంపుతున్నారు.



సదాశివనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు(ఫైల్)

పల్లె పాలనపై కలెక్టర్ ఫోకస్

- పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు
- డెయిలీ సానిటేషన్ రిపోర్టు పక్కాగా ఉండాలని ఆదేశం
- ఎంపీవోలు రోజూ గ్రామాలలో పర్యటించాలని సూచన
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 537 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పల్లెల్లో పాలనపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మరింత దృష్టి సారించారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు జ్వరాలబారిన పడుతుండడంతో.. సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నారు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు.

కార్యదర్శులపై..

పల్లెల్లో వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం పారిశుద్ధ్య సమస్యనే కావడంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉంటుంది. రోజూ కార్యదర్శులు గ్రామానికి ఉదయమే వెళ్లి లైవ్ లొకేషన్‌తో అటెండెన్స్ వేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత సానిటేషన్ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి పనులను పరిశీలించాలి. ఆయా పనులకు సంబంధించిన ఫొటోలను డీఎస్‌ఆర్ (డెయిలీ సానిటేషన్ రిపోర్ట్)ను అప్‌లోడ్ చేయాలి. ఈ నివేదిక పక్కాగా ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదేశించారు.

నిర్లక్ష్యం వహించేవారిపై వేటు

విధులలో నిర్లక్ష్యం వహించేవారిపై కలెక్టర్ వేటు వేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉద్యోగి రోజుల తరబడిగా డ్యూటీకి హాజరు కాకపోవడాన్ని ఇటీవల తన పర్యటనలో గుర్తించిన కలెక్టర్.. సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఇటీవల జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ నెలకొన్న పారిశుద్ధ్య సమస్య విషయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. దీంతో కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా చర్యలు తీసుకుంటూ విధులలో నిర్లక్ష్యం చేసేవారిని ఉపేక్షించబోనన్న హెచ్చరికను పంపిస్తున్నారు. కలెక్టర్ ముందుండి నడిపిస్తుండడంతో పల్లె పాలన గాడిన పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీవోలు, ఎంపీడీవోలకూ బాధ్యతలు..

పంచాయతీ కార్యదర్శుల పనితీరును పర్యవేక్షిస్తూనే ఆయా మండలాల పంచాయతీ అధికారి (ఎంపీవో) కచ్చితంగా రోజూ ఒక గ్రామాన్ని సందర్శించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ముందుగానే టూర్ డైరీ సిద్ధం చేసుకోవాలి. ఎంపీవో ఏ గ్రామానికి వెళ్లారో ఆ గ్రామం నుంచి లైవ్ లొకేషన్‌ను జిల్లా పంచాయతీ అధికారికి షేర్ చేయాల్సి ఉంటుంది. ఎంపీవో రోజూ తప్పనిసరి ఏదో ఒక గ్రామాన్ని విజిట్ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. నెలలో అన్ని గ్రామాలను చుట్టేయాలని, ఇదే సమయంలో ఎంపీడీవోలు కూడా గ్రామాలలో క్రమం తప్పకుండా పర్యటించాలని ఆదేశించారు. వీరి బాధ్యతలను జిల్లా పరిషత్ సీఈవో పర్యవేక్షిస్తారు. ప్రతి కార్యదర్శి, ఎంపీవో, ఎంపీడీవోలకు సంబంధించిన లైవ్ లొకేషన్ రిపోర్టును కలెక్టర్ క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారు.



జుక్కల్ మండలం బంగారుపల్లెలో సానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్



లెండి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, అధికారులు, కాంగ్రెస్ నేతలు

లెండిని త్వరగా పూర్తి చేస్తాం

- వచ్చే ఏడాది సాగునీటిని తీసుకొస్తాం
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- అధికారులతో కలిసి ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టు సందర్శనకు బస్సులో వెళ్తున్న ఎమ్మెల్యే

మద్నూర్ : తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తి చేసి, వచ్చే ఏడాది నీటిని తీసుకువస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో లెండి ప్రాజెక్ట్‌పై ఆరా తీశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ప్రైవేట్ బస్సులో మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకాకు వెళ్లి ప్రాజెక్టును సందర్శించారు. మహారాష్ట్ర ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. లెండి ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్ట్ పనులు పూర్తయితే జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల పరిధిలో 25 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. లెండి ప్రాజెక్టు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అంతర్రాష్ట్ర జల సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేసి త్వరగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని వారు పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు హన్మండ్లు స్వామి, సాయి పటేల్, విఠల్ గురూజీ, రమేశ్, శీను పటేల్, రమేశ్ దేశాయ్, అముల్ పాల్గొన్నారు.

'సకాలంలో మెరుగైన సేవలందించాలి'

- డెంగీ కేసులను నిర్లక్ష్యం చేయొద్దు
- జీజీహెచ్ వైద్యులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



జిల్లా ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో వైరల్ ఫీవర్, డెంగీ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మందుల కొరత గురించి వైద్యులు కలెక్టర్ దృష్టి కి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగు ఏర్పాట్లు చేస్తానన్నారు. ఏ మండలాల నుంచి ఎక్కువ జ్వరం కేసులు వస్తున్నాయి అని కలెక్టర్ ఆరా తీశారు. ఆయా ప్రాంతాలలో వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు సూచించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి, ఇన్ పేషంట్లతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. డెంగీ పేషెంట్లతో మాట్లాడారు. డెంగీ కేసులను నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రాంసింగ్, ఆర్‌ఎంవో శ్రీనివాస్, వైద్యులు వెంకట్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి'



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సింధుశర్మ

సదాశివనగర్: ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ పరంగా, ఆరోగ్య పరంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక నవరాత్రి వేడుకల్లో ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్న విషయంపై మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. తమకు కేటాయించిన గ్రామాలలో తరచూ పర్యటించాలని విలేజ్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూములను కాపాడాలి

- గౌరారంవాసుల తీర్మానం



అటవీ భూముల రక్షణకోసం ఫారెస్ట్ ఆఫీసర్లతో సమావేశమైన గౌరారం గ్రామస్తులు

గాంధారి: అటవీ భూములను కాపాడాలంటూ గౌరారం గ్రామస్తులు శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. రెండు రోజుల క్రితం గ్రామస్తులందరూ ఏకమై అటవీ భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను పశువులతో ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.. అటవీ భూములను కాపాడాలన్న డిమాండ్‌తో శుక్రవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. బాన్సువాడ, గాంధారి అటవీ శాఖల అధికారులను గ్రామ సభకు ఆహ్వానించారు. వారి సమక్షంలో ఆక్రమణకు గురైన అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, అటవీ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేసి కందకాలు తీయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆక్రమణకు గురైన అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి, అటవీ భూములను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం తీర్మానం కాపీలను కలెక్టర్, డీఎఫ్‌వోలకు పంపించారు. కార్యక్రమంలో బాన్సువాడ ఎఫ్‌ఆర్వో హబీబ్, గాంధారి ఎఫ్‌ఆర్వో హేమచందన, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆలస్యంగా విధులకు హాజరైన ఉపాధ్యాయుడు రియాజ్‌కు మెమో జారీ చేసినట్లు స్థానిక ఎంఈవో ఏ వెంకటేశం తెలిపారు. 'సాక్షి'లో శుక్రవారం 'టీచర్ కోసం విద్యార్థుల నిరీక్షణ' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గోపాల్‌పేట కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎం వెంకట్రామిరెడ్డితో కలిసి రాఘవపల్లితండా స్కూల్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడి హాజరు పట్టికను తనిఖీ చేశారు. విచారణ జరిపి ఉపాధ్యాయుడు రియాజ్‌కు మెమో జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ రాజయ్య ఉన్నారు.

పెద్దాస్పత్రికి రోగుల తాకిడి

- శుక్రవారం రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 2,680 ఓపీ నమోదు
- డెంగీ, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ జ్వరాలతో వస్తున్న రోగులు
- ఆస్పత్రిలో మందుల కొరత
- 15 రోజులుగా బీపీ, షుగర్ మాత్రలు లేవు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. సాధారణ రోజుల్లో 1200 నుంచి 1600 వరకు ఓపీ నమోదయ్యేది. వారం, పది రోజులుగా రెండు వేలకు పైగా రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 2,680 మంది అవుట్ పేషెంట్‌లు నమోదు అయ్యారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ఇది అత్యధికం. హైదరాబాద్‌లోని ఉస్మానియాలో 2,566, గాంధీలో 2,192, వరంగల్ ఎంజీఎంలో 2,385 ఓపీ నమోదైంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులకు రోగులు వరుస కడుతున్నారు. ముఖ్యంగా డెంగీ, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ తదితర జ్వరాలతో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపడా మందులు లేక రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. గత 15 రోజులుగా బీపీ, షుగర్ మందులు లేవు.



జీజీహెచ్‌లోని జనరిక్ మందుల దుకాణం వద్ద రోగులు



జీజీహెచ్‌లోని ఉచిత మందుల కౌంటర్ వద్ద బారులు

కొరత లేకుండా చూస్తున్నాం

సీజనల్ వ్యాధులతో ఓపీ బాగా పెరిగింది. రోగుల తాకిడి పెరగడంతో మందులు సరిపోవడం లేదు. దీంతో బయట నుంచి కొనుగోలు చేసి తెప్పిస్తున్నాం. సాధ్యమైనంత వరకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కొన్ని మందులు లేవు. మళ్లీ తెప్పిస్తాం.

– రాజేందర్, జీజీహెచ్ ఏడీ, నిజామాబాద్

విద్యార్థుల్లేక మూతబడింది



మూతపడ్డ రాజ్‌ఖాన్‌పేట పాఠశాల

మాచారెడ్డి: చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపడానికే ఇష్టపడుతుండడంతో ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. తాజాగా మండలంలోని రాజఖాన్ పేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ బాట పట్టడంతో ఆ పాఠశాల మూతబడింది. వివరాలిలా ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం జూన్ నెల చివరి వరకు నలుగురు ఉపాధ్యాయులు, పది మంది విద్యార్థులతో స్కూల్ కొనసాగింది. ఆ నలుగురిలో ఒకరు ఉద్యోగ విరమణ చేయగా.. మరో ఇద్దరు పదోన్నతిపై వెళ్లారు. దీంతో పాఠశాల భవితవ్యం ప్రశ్నార్థకమైంది. మిగిలిన టీచర్ సొంతంగా వలంటీర్లను నియమించి విద్యాబోధన చేస్తామని చెప్పినా.. విద్యార్థులు బడికి రావడానికి ఇష్టపడలేదు. విద్యార్థులందరూ ప్రైవేట్ స్కూల్‌లో చేరడంతో విద్యాశాఖ అధికారులు చేసేదేమీ లేక జూలై మొదటి వారంలో ఉన్న ఒక్క టీచర్‌ను డిప్యుటేషన్‌పై ఘన్‌పూర్ స్కూల్‌కు పంపించి, పాఠశాలను మూసివేశారు.

మూసివేశాం..



మండలంలోని రాజ్‌ఖాన్ పేటలోని ప్రాథమికోన్నత పాఠశాలను కేవలం విద్యార్థులు లేకనే మూసేశాం. పాఠశాలను కాపాడుకోవాలని శాయశక్తులా ప్రయత్నించాం. వలంటీర్లను నియమించి ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన చేస్తామని చెప్పినా ఫలితం లేకుండా పోయింది.

– ఎల్లయ్య, ఎంఈవో

క్లుప్తంగా

మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలి



ఎల్లారెడ్డి : మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించారు. తహసీల్దార్ మహేందర్‌కుమార్, జీపీ కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కామారెడ్డిలోనే ప్రతిభ పురస్కారాలు అందజేత

కామారెడ్డి అర్బన్ : మున్నూరుకాపు కాచిగూడ ట్రస్ట్ ద్వారా ప్రతిభ పురస్కారాలకు ఎంపికైన కామారెడ్డి జిల్లా విద్యార్థులకు ఈనెల 31న శనివారం ఉదయం 10గంటలకు మెడికల్ కళాశాల సమీపంలోని మున్నూరుకాపు జిల్లా భవనం వద్ద అందజేస్తామని సంఘం ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య తెలిపారు. ప్రతిభ పురస్కారం కింద ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ. 1800 రూపాయల చెక్కు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా విద్యార్థులు హైదరాబాద్ వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

హుండీల ఆదాయం లెక్కింపు



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ హుండీలను శుక్రవారం కొత్తగా బదిలీపై వచ్చిన దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ విజయరామారావు సమక్షంలో లెక్కించారు. రెండు నెలలకు సంబంధించిన హుండీల డబ్బులు రూ. 3,74,260లు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. రేకుల షెడ్డుకు అసిస్టెంట్ కమిషనర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్, సిబ్బంది సంతోష్, నరేందర్, అర్చకులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

రామారెడ్డి : బీజేపీ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రామారెడ్డి మండల కేంద్రంలో కార్యకర్తల సభ్యత్వ నమోదు రామారెడ్డి మండల అధ్యక్షుడు కట్ట ఈశ్వర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని, రైతు రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సంకటి విఠల్, జిల్లా ఈసీ నెంబర్ భూమా గౌడ్ ,జిల్లా కిసాన్ మోర్చా ఈసీ మెంబర్ గోపి, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకన్న, మండల కిషన్ మోర్చా అధ్యక్షులు గాండ్ల సాయిలు, రామారెడ్డి మండల ఉపాధ్యక్షులు రమేశ్, పాల్గొన్నారు.



రామారెడ్డిలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి

బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలి

ఎల్లారెడ్డి : ప్రతి జీపీలో బీజేపీ సభ్య త్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు నర్సింలు, బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్ తదితరులున్నారు.

ఓటరు నమోదు సర్వే నిర్వహించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఇంటింటా ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించిన సర్వేను నిర్వహించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో జరుగుతున్న హౌజ్ టు హౌజ్ సర్వేను పరిశీలించారు. ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్‌వోకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె ప్రభాకర్, బీఎల్‌వో అనిల్‌కుమార్ తదితరులున్నారు.



సోమార్‌పేట్‌లో ఇంటింటా సర్వే వివరాల గురించి మాట్లాడుతున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఓటరు సర్వేను పూర్తి చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): ఇంటింటా ఓటరు సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామంలో ఓటరు సర్వేను ఆయన పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు, ఇంటి నంబర్లు, ఆధార్ నంబర్లను సరి చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

2న బీమా వారోత్సవాలు

కామారెడ్డి అర్బన్ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు బీమా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎల్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ కృష్ణమోహన్, ఏబీఎం హిమన్ష్ చౌహన్‌లు తెలిపారు.

రుణమాఫీ సర్వే పక్కాగా చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రుణమాఫీ కాని రైతులకు సంబంధించి కుటుంబసభ్యుల నిర్ధారణ ప్రక్రియను పకడ్బందీగా చేయాలని ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీప్రసన్న సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి, బొల్లారం గ్రామాలలో వ్యవసాయాధికారులు చేపట్టిన కుటుంబసభ్యుల నిర్ధారణ ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు.

నేడు మున్సిపల్ ట్రాక్టర్ల ప్రారంభం

కామారెడ్డి టౌన్ : మున్సిపల్ నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌లను మున్సిపల్ కార్యాలయంలో నేడు(శనివారం) ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి



బాన్సువాడ రూరల్ : గణేశ్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ కృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్ గ్రామాల్లో శాంతికమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఏర్పాటు చేయబోయే గణేశ్ మండళ్లు, వారి నిర్వాహకుల వివరాలు తెల్సుకున్నారు. అన్నదానంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ వెంకటరమణరావు,సాయిలు, అంజాగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్) : గణపతి ఉత్సవాలు ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నరేష్ అన్నారు. శుక్రవారం బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులు, అధికారులకు సహకరించాలని కోరారు.

వికలాంగులకు ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలి



బాన్సువాడ : వికలాంగుల సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య అన్నారు. శుక్రవారం బాన్సువాడలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) 3వ మహాసభలు నిర్వహించారు. మహిళ శక్తి క్యాంటిన్లలో వికలాంగులకు వాటా ఎక్కడ అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ రూ. 6 వేలను అమలు చేయాలని, వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బస్వరాజ్, జిల్లా అధ్యక్షులు గంగాధర్‌చారి తదితరులున్నారు.

చెత్త కుప్పలు తొలగించాలి



జిల్లా కేంద్రంలోని హరిజనవాడ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



పట్టణంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ముందు వారం రోజులుగా తీయని చెత్త

- 'సాక్షి' కథనానికి పురవాసుల నుంచి స్పందన
- పలు కాలనీల వాసుల మొర

కామారెడ్డి టౌన్ : విషజ్వరాలు, డెంగీ ప్రబలుతున్న నేపథ్యంలో కామారెడ్డి పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణ సానిటేషన్ విభాగం, అధికారుల నిర్లక్ష్యంతో కాలనీలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతుంది. 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'పారిశుధ్యం..అధ్వానం' కథనానికి పురప్రజల్లో చర్చ జరుగుతోంది. తమ వార్డులో, కాలనీలో వారం రోజులకు పైగా చెత్తను తొలగించకపోవడం, మురికి కాలువలు శుభ్రం చేయడం లేరని, చెత్త సేకరణ ఆటోలు రావడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేరని ప్రజలు వాపోతున్నారు. శుక్రవారం 'సాక్షి'తో ముదాంగల్లి, శేర్‌గల్లి, హరిజనవాడ, వివేకానందకాలనీ, బతుకమ్మకుంట కాలనీల నుంచి పలువురు ఫోన్‌లో సానిటేషన్ సమస్యపై వాపోయారు. సమస్యల ఫొటోలను పంపుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేరని ఇద్దరు కౌన్సిలర్లు కూడా చెప్పడం గమనార్హం. పట్టణంలో ప్రత్యేక శ్రద్ధతో అన్ని కాలనీలో సానిటేషన్, చెత్త, మురుగు కాలువల సమస్యను పరిష్కరించాలని పురప్రజలు కోరుతున్నారు.

టీఎన్జీవోస్ నాయకులకు స్వాగతం



కామారెడ్డి అర్బన్ : టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారం జగదీష్, ముజీబ్ శుక్రవారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా కామారెడ్డిలో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రతినిధులు ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కార్యదర్శి ఎం.నాగరాజు తదితరులున్నారు.

బాలల హక్కులపై అవగాహన



మాచారెడ్డి : భూప్రపంచంలో ఉన్న ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉంటుందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ స్వర్ణలత అన్నారు. శుక్రవారం మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు చట్టాలపై అవగాహన అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్ వెంకటాచారి, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

సమావేశానికి అంబేడ్కర్‌వాదులు తరలిరావాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో శనివారం నిర్వహించే సమావేశానికి అంబేడ్కర్‌వాదులు తరలిరావాలని కామారెడ్డి జిల్లా అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు అట్కరి బబ్లూ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. ఎల్లారెడ్డి డివిజన్ ఇన్‌చార్జి బిట్ల సురేందర్, కన్వీనర్ మార్ల సాయిలు తదితరులున్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



మద్నూర్(జుక్కల్) : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పోరాడిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మండలంలోని లచ్చన్ గ్రామంలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విజయ్, మండల అధ్యక్షుడు మారుతి, మాజీ ఎంపీపీ గంగారం తదితరులున్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్: ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి-ముత్తకుంట మార్గంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్నాపల్లి-ముత్తకుంట మార్గంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనగా కుర్నాపల్లికి చెందిన నరేశ్, నగేశ్‌లకు గాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

పేకాట స్థావరాలపై దాడి

ఖలీల్‌వాడి/ మోర్తాడ్: జిల్లా కేంద్రంలోని ఆరో టౌన్ పీఎస్ పరిధిలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.1,15 లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మోర్తాడ్ మండలం సుంకెట్‌లో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడిచేసి రూ.12,170 నగదును స్వాధీనం చేసుకున్నమని వివరించారు.

క్రైం కార్నర్

ప్రేమ జంట అఘాయిత్యం



- యువకుడి ఆత్మహత్య, యువతి ఆత్మహత్యాయత్నం

బోధన్: ప్రేమ విఫలమైన ఓ జంట అఘాయిత్యానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఎడపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తెలిపిన ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మోరె దీపక్(20) తన ప్రేమ విఫలమైందని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీపక్‌కు ప్రేమించిన అమ్మాయి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది.

హత్య కేసులో నిందితుల రిమాండ్



కామారెడ్డి క్రైం: భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో జరిగిన వ్యాపారి విశ్వనాథం హత్య కేసులో నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విశ్వనాథం(64) గుడికి వెళ్లి వస్తుండగా అతనితో కొద్దిరోజులుగా గొడవలు ఉన్న లక్ష్మీబాయి, ఆమె అల్లుడు రాజశేఖర్, పోచయ్య, జంగం శంకరప్పలు దాడి చేయగా తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: అధికారుల విధులకు ఆటంకం కలిగించిన మహమ్మద్ మునావర్, మహ్మద్ అఖ్లాక్ అహ్మద్‌లకు వేర్వేరు కేసుల్లో జైలుశిక్షను విధించినట్లు నిజామాబాద్ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పాముజుల శ్రీనివాస్‌రావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లోని తెలంగాణ సూపర్ మార్కెట్ పురాని హావేలి దగ్గర పోలీస్ కానిస్టేబుల్ సయ్యద్ హమీద్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆ ప్రాంతంలోని పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. ఇది గమనించిన ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ మునావర్ 2018నవంబర్14న ఉదయం కానిస్టేబుల్‌తో 'నీవు ఇక్కడ ఏం చేస్తున్నావు, చాలా రోజుల నుంచి నిన్ను గమనిస్తున్నా.. ఇక్కడ ఏదైనా ఇన్ఫర్మేషన్ కావాలంటే నన్ను కలవాలి. నేను ఇక్కడ సొసైటీకి ప్రెసిడెంట్‌ని అంటూ కానిస్టేబుల్ సయ్యద్ హమీద్‌పై చేతులు వేసి నూకేశాడు. ఈ అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు కావడంతో మునావర్‌కు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే అదనంగా రెండు వారాలు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

అర్సపల్లి శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేస్తున్నారనే సమాచారం మేరకు 2018డిసెంబర్24న నిజామాబాద్ మండల కార్యాలయ రెవెన్యూ సిబ్బంది వెళ్లగా అక్కడ ఉన్న మహ్మద్ అఖ్లాక్ అహ్మద్ అనే వ్యక్తి రెవెన్యూ సిబ్బందిని అధికారిక విధులు నిర్వహించకుండా, విధులకు ఆటంకపరిచాడు. గ్రామ రెవెన్యూ అధికారి గాజుల చిన్ననారాయణను దూషిస్తూ కట్టెతో కొట్టి విధులు నిర్వహించకుండా ఆటంకపరిచాడనే అభియోగాలు కోర్టు నేరన్యాయ విచారణలో రుజువు కావడంతో ధర్మపురిహిల్స్‌కు చెందిన మహమ్మద్ అఖ్లాక్ అహ్మద్‌కు ఏడాది సాధారణ జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు తీర్పు చెప్పారు. పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్ గౌడ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- పోలీసుల అదుపులో భర్త..?

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో రాథోడ్ విజయ అలియాస్ మీనాక్షి(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహమ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన విజయకు డిచ్‌పల్లి మండలం వెస్లీనగర్ తండాకు చెందిన గబ్బర్‌సింగ్(రిటైర్డ్ జవాన్)తో 2016లో రెండవ వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరు. దంపతులు ఏడాది కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం గబ్బర్‌సింగ్ డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఉన్న తన ఇంటికి వచ్చి ఉంటున్నాడు. దీంతో గురువారం(29న) రాత్రి విజయ డిచ్‌పల్లిలోని తన భర్త వద్దకు వచ్చింది. రాత్రి విజయ అనుమానస్పదరీతిలో ఉరేసుకుంది. భర్త వెంటనే ఆమెను జిల్లాలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అదేరాత్రి గబ్బర్‌సింగ్ డిచ్‌పల్లి ఠాణాకు వచ్చి పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం డిచ్‌పల్లి సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలిసిన మృతురాలి విజయ తల్లిదండ్రులు, బంధువులు వెంటనే డిచ్‌పల్లికి చేరుకున్నారు. విజయను భర్త గబ్బర్‌సింగ్, అతడి కుటుంబ సభ్యులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లి సకున ఆరోపించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి కుటుంబీకులు నిందితుడి ఇంటిపై దాడికి పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు అతడి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాథోడ్ విజయ (ఫైల్)

జిల్లా కేంద్రంలో 11 నెలల బాలుడు..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణకాలనీలో ఓ బాలుడు అనునామానస్పదస్థితిలో మృతి చెందినట్లు ఐదోటౌన్ ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి బ్రాహ్మణ కాలనీకి చెందిన మంగ మహేశ్, అనురాధ దంపతులకు మంగ విఘ్నేశ్(11 నెలల బాలుడు) ఉన్నారు. నాలుగు రోజుల క్రితం విఘ్నేశ్ ఇంట్లోనే తీవ్ర జర్వంతో బాధపడుతున్నాడు. ఈ నెల 28న తల్లి మంగ అనురాధ అనారోగ్యానికి గురికావడంతో జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటోంది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలుడు శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని భర్త చికిత్స పొందుతున్న భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. భర్తపై అనుమానం ఉన్న భార్య అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్ప మృతిగా కేసు నమోదు చేసి, బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాన్సువాడలో ప్రైవేటు ఆస్పత్రి నర్సు..



మమత (ఫైల్)

బాన్సువాడ: పట్టణంలోని చైతన్య కాలనీలో నివాసముంటున్న మమత (23) అనే ప్రైవేటు ఆస్పత్రి నర్సు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బీర్కూర్ మండలం బరంగెడ్గికి చెందిన గాండ్ల మమత పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. చైతన్య కాలనీలోని ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటోంది. మమత వాజిద్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ ఇద్దరి ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఆమె అద్దెకు ఉన్న గదికి ఉదయం అతను వచ్చినట్లు సమాచారం. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియుడిపై మమత ఒత్తిడి తేవడంతోనే ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం మమతను గది నుంచి భుజంపై వేసుకుని ప్రశాంత్ అనే వ్యక్తి మెట్లు దిగుతుండడంతో అక్కడే ఉన్న కొందరు ఏమైందని అడుగగా పిడుసు వచ్చిందని చెప్పి మమతను ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు చూసి అప్పటికే మమత చనిపోయినట్లు నిర్ధారించడంతో ఆస్పత్రికి తీసుకొచ్చిన యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. మమత పెళ్లి చేసువాలని అన్నందుకు ప్రియుడు ప్రశాంత్ హత్య చేసి ఉంటాడని బాధిత కుటుంబీకులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణ తెలిపారు. మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

శుభకార్యానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువపై ఉన్న మూల మలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికిగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా విషపురి గ్రామానికి చెందిన పాంచాల ఉష కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి ఆటోలో వెళ్తుండగా ఎదురుగుండా మేకల బొలెరో వాహనం వేగంగా వచ్చింది. మూల మలుపు వద్ద అతి వేగంతో ఉన్న ఆ వాహనం అదుపు తప్పి ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఉష కిందపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కర్రలతో దాడి చేసుకున్న యువకులు

ఖలీల్‌వాడి: కర్రలతో అల్లరిమూకలు దాడి చేసుకున్న ఘటన నగరంలోని గౌతంనగర్ చౌరస్తాలో చోటు చేసుకుంది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన మధు గ్రూప్ పవన్, గఫార్ గ్రూపుల మధ్య శుక్రవారం సాయంత్రం గొడవ జరిగింది. దీంతో వారు కర్రలతో మధుపై దాడి చేశారు. ఈ ఘటనలో మధు తీవ్రంగా గాయపడడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. మధు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా పవన్, గఫార్‌లు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకులు

ఖలీల్‌వాడి: ఇందల్వాయి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు వచ్చిన యువతిపై అదే కళాశాలకు వచ్చే యువకుడు, ఆటో డ్రైవర్ వీడియో చిత్రీకరించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సదరు యువతిని ఇద్దరు యువకులు ఫాలో చేస్తూ వీడియో చిత్రీకరిస్తూ కాలేజీలోకి వెళ్లగా అక్కడే ఉన్న భజరంగ్ కార్యకర్త సెల్ ఫోన్‌ను తీసుకొని నిలదీశారు. వెంటనే అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం వీడియో తీసిన యువకుడితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఒకటో టౌన్ పోలీసులు కాలేజీకి యువకులను, ఆటోను పీఎస్‌కు తరలించారు. పోలీసులు పిట్టి కేసు పెట్టి వదిలేసినట్లు సమాచారం.

కౌన్సిలర్‌పై దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జీలో కొందరు వ్యక్తులు కౌన్సిరల్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని గాయాలతో ఉన్న కౌన్సిలర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పట్టణ సీఐ వీరయ్యను వివరాలు కోరగా ఇప్పటి వరకు దాడి విషయమై ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా కౌన్సిలర్‌పై దాడి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్‌గా మారింది. దీనిపై పలురకాల పుకార్లు వెల్లువెత్తుతున్నాయి.

ఆటో ఎత్తుకెళ్లిన దొంగలు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఆటోను దొంగలు ఎత్తుకెళ్లినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కంఠేశ్వర్‌కు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన ఆటోను ఇంటి ఎదుట ఉంచి నిద్రించాడు. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి ఆటో కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ఆటో ఆచూకీ దొరకలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.